క్లుప్తంగా

సార్వత్రిక బరిలో 13 మంది

వెంకటాచలం : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సర్వేపల్లి నియోజకవర్గంలో 13 మంది అభ్యర్థులు వివిధ పార్టీల నుంచి పోటీలో ఉన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా పూల చంద్రశేఖర్, బీఎస్పీ అభ్యర్థిగా జానకి ప్రసాద్, యంగ్ సీనియర్ రిచ్ కామన్ పీపుల్ కింగ్స్ పార్టీ అభ్యర్థిగా విజయ్‌బాబు, జాతీయ జనసేన అభ్యర్థిగా నక్కా మనోహర్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా పినిశెట్టి శ్రీహరి, స్వతంత్ర అభ్యర్థులుగా కడివేటి వెంకయ్య, కోసూరు నారాయణ, గొల్లమూరి రవి, టి.వేణు, తీగల భాస్కర్, మన్నెం పెద్దపుట్టయ్య పోటీలో ఉన్నారు.

• **కోవూరు :** కోవూరు నియోజకవర్గం నుంచి మొత్తం 13 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. తొలుత 19 మంది జాబితాలో ఉండగా ఒక్క సోమవారం ఆరుగురు తమ నామినేషన్లు విత్‌డ్రా చేసుకున్నారు.

తప్పుడు విమర్శలు తగవు


మాట్లాడుతున్న ప్రసాద్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : తనపై టీడీపీ నాయకులు తప్పుడు విమర్శలు చేస్తున్నారని, ఇవి తగవని పంచేడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రసాద్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. గతంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీలో ఉన్నప్పుడు గ్రామంలో వాటర్‌ప్లాంట్, మరికొన్ని అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వగా, ఆ నిధులు చాలక తాను సొంత నిధులు వెచ్చించి పనులు పూర్తి చేశానని వివరించారు. ప్రస్తుతం కొందరు టీడీపీ నాయకులు తానుపై ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేస్తున్నారన్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు.

నేత్రదానం


మల్లికార్జున్(ఫైల్)

విడవలూరు : విడవలూరులోని అంకమ్మతల్లి ఆలయ పూజారి చిట్టేటి మల్లికార్జున్ (68) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యుల కోరిక మేరకు మల్లికార్జున్ నేత్రాలను మనసేవా సంస్థ చైర్మన్ దేవళ్ల శ్రీనివాసులురెడ్డి సమక్షంలో నెల్లూరు మోడరన్ ఐ ఆస్పత్రి వారికి దానం చేశారు. ఐ టెక్నీషియన్ వేణు ఆయన నేత్రాలను సేకరించారు.

ఎమ్మెల్యే ప్రసన్నపై ఫిర్యాదు

కోవూరు : కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిపై ఇందుకూరుపేట పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎస్సై వీరేంద్రబాబు వివరాల మేరకు.. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి తనను వ్యక్తిగతంగా దూషించారని ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు ఎంపీడీఓ సాయిలహరి, కొత్తూరు పంచాయతీ కార్యదర్శి జగదీష్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఐదేళ్లలో సంక్షేమ కాంతులు


ప్రజలకు నమస్కారం చేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

• కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

విడవలూరు : ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమ కాంతులు వెల్లివిరిశాయని, ఇది కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోరారు. మండలంలోని చౌకచర్ల, దంపూరు, వావిళ్ల, వీరారెడ్డిపాళెం, వరిణి, దండిగుంట, గాదెలదొన్నె గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు ఇచ్చి దిష్టితీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని, ఇవి కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలను నమ్మవద్దని కోరారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు తుమ్మల లక్ష్మయ్య, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మురళీరెడ్డి, వినోద్‌కుమార్, ఉదయ్‌భాస్కర్, సురేంద్రరెడ్డి, నారాయణ, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వేమిరెడ్డి దంపతులకు పేదలంటే చులకన

కోవూరు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నెల్లూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి పేదలంటే చులకన అని ఎమ్మెల్యే ప్రసన్న అన్నారు. రాష్ట్రంలో బీసీలు, మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దఎత్తున రాజకీయ అవకాశాలు కల్పించి దేశచరిత్రలోనే ఎక్కడా లేనివిధంగా వారికి చట్టసభల్లో స్థానం కల్పించారని గుర్తుచేశారు. వేమిరెడ్డి దంపతులు గడిచిన ఐదేళ్లలో జగన్‌మోహన్‌రెడ్డిని అడ్డం పెట్టుకుని అధికారం అనుభవించారని, ఇప్పుడు నెల్లూరు, కందుకూరు నియోజకవర్గాల్లో ఓ ముస్లిం మైనారిటీకి, ఓ బీసీకి సీటు ఇచ్చారని పార్టీని వీడడం తగదన్నారు. కోవూరు నియోజకవర్గంలో గతంలో ఎందరో ధనవంతులు పోటీ చేశారని, అయితే వారికి నియోజకవర్గ ప్రజలు ఓటుతో సమాధానం చెప్పారన్నారు. ఇప్పుడు కూడా అదే విధంగా వేమిరెడ్డి దంపతులకు ఓటుతో బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి స్థానంలో కూర్చోపెట్టేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, హరికుమార్, శ్రీనివాసులు, శ్రీధర్, మల్లికార్జున, భక్తవత్సలం, చిన్నమస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనులను వేగవంతం చేయండి


మాట్లాడుతున్న ఏఈఓ అహ్మద్‌బాషా

మనుబోలు : వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి నాడు–నేడు పనులను పూర్తి చేయాలని ఏఈఓ అహ్మద్‌బాషా అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ మండలంలోని 29 పాఠశాలల్లో నాడు–నేడు పనులను ప్రారంభించామన్నారు. వీటిలో 16 పాఠశాలల ఖాతాల్లో నగదు జమ అయ్యిందన్నారు. మిగిలిన పాఠశాలల్లో జరుగుతున్న పనులకు నగదు అవసరమైతే సర్దుబాటు చేయాలని హెచ్‌ఎంలకు సూచించారు. కొన్ని పాఠశాలల్లో ఇప్పటికే పనులు పూర్తవగా ప్రభుత్వం సరఫరా చేసిన మెటీరియల్ మిగిలి ఉండడంతో వాటిని పనులు జరుగుతున్న పాఠశాలలకు సర్దుబాటు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రమేష్, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ మాను ఆదిశేషయ్య, సీఆర్‌ఎంటీలు చెంచురామయ్య, స్వరూప, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో కీలకం


విద్యార్థినికి సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్ రమేష్

ఇందుకూరుపేట : సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో కీలకమైనదని పల్లిపాడు డైట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ అన్నారు. 2021–23 విద్యా సంవత్సరంలో డీఎల్‌ఈడీ పూర్తి చేసిన వారికి సోమవారం కళాశాలలో సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల కోర్సును విజయవంతంగా పూర్తిచేసిన వారు భవిష్యత్తును ఉత్తమంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఈ బ్యాచ్‌లో ప్రథమ స్థానంలో ఎస్కే మస్తాని, ద్వితీయ స్థానంలో ఎస్డీ సల్మా, తృతీయ స్థానంలో టి.శిరీష నిలిచినట్లు ప్రిన్సిపల్ వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశ్వరరావు, బాలాజీరావు, కె.విజయచంద్ర, ఎస్‌బీ దాస్, శివ, కె.షఫీ, అహ్మద్, సూపరింటెండెంట్ సురేష్ పాల్గొన్నారు.

ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలి

• కలెక్టర్ హరి నారాయణన్


వాహన తనిఖీని పరిశీలిస్తున్న కలెక్టర్

వెంకటాచలం : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని కలెక్టర్ హరినారాయణన్ సూచించారు. వెంకటాచలం టోల్‌ప్లాజా సమీపంలో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీని ఎన్నికల ప్రత్యేక సాధారణ పరిశీలకుడు రామ్‌మోహన్ మిశ్రాతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. టోల్‌ప్లాజా వద్ద ఇరువైపులా వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు.

మంత్రి కాకాణి ఎన్నికల ప్రచారం నేడు

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం మండలంలోని పలుగ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేస్తారని సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఉదయం తోడేరు పంచాయతీ శాంతినగర్, రత్నగిరి, తోడేరు ఎస్సీ కాలనీ, మహ్మదాపురం గ్రామాల్లో ప్రచారం చేస్తారన్నారు. సాయంత్రం తాటిపర్తి, నల్లపాళెం, ఆనాటికండ్రిక, వరదాపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొనాల్సిందిగా కోరారు.

ఆర్థిక సాయంతో చిన్నారి ఆపరేషన్



మనుబోలు : తలలో నెమ్ము చేరి ఇబ్బంది పడుతున్న చిన్నారికి జట్లకొండూరు ఉప సర్పంచ్ ఆవుల తులసీరాం దాతల సాయంతో ఆపరేషన్ చేయించారు. నెల్లూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని ఆయన సోమవారం పరామర్శించారు. గోవిందరాజపురానికి చెందిన ఆరేళ్ల చిన్నారి శ్రావ్య తలలో నీరు చేరి అస్వస్థతకు గురైంది. చిన్నారి తల్లిదండ్రులు పేదవారు కావడంతో వారు తులసీరామ్‌ను ఆశ్రయించారు. వైద్య పరీక్షలు చేయించగా ఆపరేషన్‌కు రూ.50 వేలు ఖర్చవుతుందని తెలిసింది. దీంతో ఉప సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కిరణ్‌కుమార్‌రెడ్డి, వెంకటరమణయ్య, ప్రశాంత్, శ్రీనివాసులు తదితర దాతలు ఆర్థికసాయం చేయడంతో పాపకు ఆపరేషన్ చేయించారు. ప్రస్తుతం పాప ఆరోగ్యం నిలకడగా ఉంది.

దుగ్గుంటలో టీడీపీకి బిగ్‌షాక్


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి కాకాణి

• 40 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

పొదలకూరు : మండలంలోని దుగ్గుంట పంచాయతీలో తెలుగుదేశం పార్టీకి బిగ్‌షాక్ తగిలింది. దుగ్గుంట ఎస్సీ కాలనీ, దుగ్గుంటరాజుపాళెనికి చెందిన 40 కుటుంబాల వారు నెల్లూరులోని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరు చాలాకాలంగా టీడీపీలో కొనసాగుతున్నా సంక్షేమం, అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరారు. అట్ల భాస్కర్‌రెడ్డి, ఎం.వేమయ్య, కుమ్మరగుంట రాజయ్య, కె.పెంచలయ్య, పునిగోటి అంజయ్య జగచర్ల మోహన్ తదితరులు పార్టీ మారిన వారిలో ఉన్నారు. మూడురోజుల ముందు ఇదే పంచాయతీలోని రామాపురం ఎస్టీకాలనీకి చెందిన 20 కుటుంబాల వారు మంత్రి కాకాణి సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. దీంతో దుగ్గుంట పంచాయతీలో తెలుగుదేశం పార్టీ ఖాళీ అయ్యిందని చెప్పుకుంటున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సోమిరెడ్డి వద్దకు వెళ్లి పార్టీలో చేరిన వారు అతని తీరు నచ్చక 24 గంటలు గడవక ముందే వైఎస్సార్‌సీపీ వైపు పరుగులు తీస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాల్లో పింఛన్ నగదు


మాట్లాడుతున్న ఎంపీడీఓ సుధాకర్

మనుబోలు : ఏప్రిల్ నెలకు సంబంధించి పింఛన్ నగదును వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ఇన్‌చార్జి ఎంపీడీఓ సుధాకర్ తెలిపారు. ఆయన తన కార్యాలయంలో ఈఓపీఆర్డీ ప్రసాద్‌తో పెన్షన్ల పంపిణీపై సోమవారం సమీక్షించారు. మండలంలో మొత్తం 5,849 మంది పింఛన్‌దారులు ఉన్నారని, వీరిలో బ్యాంక్ ఖాతాలు ఉన్న 1,471 మందికి మాత్రమే నేరుగా నగదు జమ అవుతుందని తెలియజేశారు. బ్యాంకు ఖాతాలు లేని వారు, నడవలేని వృద్ధులు, వికలాంగులకు సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి పింఛన్ అందజేస్తారని వెల్లడించారు. వారి వెంట ఏఓ రవికుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలోనే ఉంటాం


పార్టీలో చేరిన వారితో గీతారెడ్డి, పూజారెడ్డి

కోవూరు : మండలంలోని గంగవరం రామచంద్రాపురం కాలనీకి చెందిన పలు కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలోనే ఉంటామని ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి, కోడలు పూజారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కోవూరులో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ శ్మశానం నిర్మాణం పేరుతో తమను ప్రలోభాలకు గురిచేసి ప్రశాంతిరెడ్డి ఇంటికి తీసుకెళ్లారని, అక్కడ తమకు టీడీపీ కండువాలు వేశారని తెలిపారు. తమకు ఐదేళ్లలో అనేక సంక్షేమ పథకాలు అందాయని, అందుకే వైఎస్సార్‌సీపీలోకి వచ్చినట్లు తెలిపారు. సర్పంచ్ లక్ష్మీకుమారి, ఉప సర్పంచ్ మోషే, డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత తదితరులు పాల్గొన్నారు

బాలసదన్‌ను సందర్శించిన జడ్జి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీ యామిని ఆదేశాల మేరకు నగరంలోని బాలసదన్‌ను జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి సోమవారం సందర్శించారు. బాలసదన్‌లోని చిన్నారులకు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, విధులపై అవగాహన కల్పించారు. భోజనం, వసతి, వైద్య సదుపాయాలపై చిన్నారులను ఆరాతీశారు. అనంతరం వసతి గదులను తనిఖీ చేశారు. ఎలాంటి సమస్యలు ఉన్నా జిల్లా జడ్జి దృష్టికి తీసుకురావాలని పిల్లలకు సూచించారు. జడ్జి వెంట లక్ష్మీబాయి, సంపూర్ణమ్మ, తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పేదలకు మేలు

కొడవలూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పేదలకు మేలు జరుగుతుందని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేణుంబాక విజయసాయిరెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గెలుపును కాంక్షిస్తూ నార్తురాజుపాళెం బజారు సెంటర్‌లో సోమవారం ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు సంతోషంగా ఉండాలన్న ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పారదర్శకంగా అందించారన్నారు. పేదరికం లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. గతంలో ఎంతో మంది ముఖ్యమంత్రులు వచ్చినా పేదలను ప్రత్యేకంగా పట్టించుకున్న ముఖ్యమంత్రులు వైఎస్సార్, జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని పేర్కొన్నారు. టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు డబ్బు ఎర వేసి ఎన్నికల్లో గెలవాలని యోచిస్తున్నారని, గతంలో డబ్బున్న అభ్యర్థులను కోవూరు ఓటర్లు ఓడించి ఇంటికి పంపారని గుర్తుచేశారు. మేలు చేసిన ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గాలి జ్యోతి, సర్పంచ్ బి.సుప్రియ, సచివాలయాల మండల కన్వీనర్ కొండా శ్రీనివాసులురెడ్డి, నాయకులు ఎన్.మాణిక్యరావు, పి.మధుసూదన్‌రెడ్డి, ఎండీ మరిముల్లా, గాలి సునీల్, కాకాణి శ్రీనివాసులు పాల్గొన్నారు.


కొడవలూరు : నార్తురాజుపాళెం బజారులో ఇంటింటి ప్రచారం చేస్తున్న చలపతిరావు

జగనన్న ప్రభుత్వాన్ని గెలిపించండి

మనుబోలు : హామీలన్నింటినీ అమలు చేసిన జగనన్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని, మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత కోరారు. మండలంలోని బద్దెవోలు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆమె సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గత ఐదేళ్లుగా కాకాణి చేసిన సేవలను వారికి వివరించారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు అండగా నిలిచిన విషయాన్ని గుర్తుచేశారు. కాకాణి ఇంటి పెద్ద బిడ్డలా ప్రజలకు సేవలందించారని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వంలో తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను నాన్న పరిష్కరించారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా జగనన్న ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం పాటుపడిందన్నారు. పూజిత ప్రచారానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. ఆమె వెంట ఎంపీపీ గుండాల వజ్రమ్మ, సర్పంచ్ యూఎస్‌కే రెడ్డి, మనుబోలు ఉప సర్పంచ్ కడవేటి చంద్రశేఖర్‌రెడ్డి, ఏడెం మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గుంజి రమేష్, దాసరి మహేంద్రవర్మ, చలగల దయాకర్, దువ్వూరు సుధాకర్‌రెడ్డి, గిరి తదితరులు పాల్గొన్నారు.


ఇందుకూరుపేట : ఎన్నికల ప్రచారంలో రజత్‌కుమార్‌రెడ్డి

పిడూరులో..

మండలంలోని పిడూరు గ్రామంలో మాజీ సర్పంచ్ మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి కాకాణిని మరోసారి గెలిపించాలంటూ ఓటర్లను అభ్యర్థించారు. పిడూరు గ్రామంలో గతంలో ఏ ప్రభుత్వం చేయనంత అభివృద్ధిని మంత్రి కాకాణి ఈ ఐదేళ్లలో చేసి చూపించాడన్నారు.

ఆర్యవైశ్య నాయకుల ఇంటింటి ప్రచారం

పొదలకూరు : పట్టణంలోని వైఎస్సార్‌సీపీ ఆర్యవైశ్య ప్రముఖులు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బావ వాకాటి ద్వారకానాథ్‌రెడ్డితో కలిసి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రామనగర్‌గేటు సెంటర్‌లో వ్యాపారులను కలిసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని గెలిపించాల్సిందిగా కోరారు. ఆయన చేసిన అభివృద్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో నాయకులు ఆదూరు వెంకటసుబ్బయ్య, ఆకులూరు హేమంత్‌కుమార్, అమరా భగవాన్, త్యాగరాజు, రవి, అమరా శివ, సూరి, మధు, గుర్రం భాస్కర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాకాణిని ఆశీర్వదించండి

తోటపల్లిగూడూరు : సర్వేపల్లి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించి విజయం అందించాలని వైఎస్సార్‌సీపీ నేత కోడూరు దిలీప్‌రెడ్డి కోరారు. పార్టీ నాయకులు కావల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో కోడూరు పంచాయతీ గమళ్లపాళెం, మిక్స్‌డ్ కాలనీ, మహాలక్ష్మీపురం గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి మంచి జరిగిందని, మరోసారి వైఎస్సార్‌సీపీని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దువ్వూరు శ్రీనివాసులురెడ్డి, మారంరెడ్డి బుజ్జిరెడ్డి, ఆగాల శ్రీనివాసులురెడ్డి, సీతారామయ్య, పామంజి దుర్గ, రవి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను సీఎం చేసుకోవాలి

ఇందుకూరుపేట : జనరంజక పాలన అందిస్తున్న జగనన్నను సీఎం చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని వైఎస్సార్‌సీపీ కోవూరు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో నల్లపరెడ్డి రాహిన్‌రెడ్డితో కలిసి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న నాయకత్వంలో రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


మనుబోలు : పిడూరులో ఓటు అభ్యర్థిస్తున్న సాయిమోహన్‌రెడ్డి


మనుబోలు : పూజితకు స్వాగతం పలుకుతున్న మహిళలు


పొదలకూరు పట్టణంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఆర్యవైశ్య నాయకులు


తోటపల్లిగూడూరు : కోడూరు పంచాయతీ గమళ్లపాళెంలో..